## సింగిల్ పేజీ కథలు

**"సార్! మీకు ఉత్తరం వచ్చిందండీ!" ఉత్తరం అందిస్తూ అన్నాడు అటెండర్ రాము.**

"ఉత్తరమా? నాకా? నాకు ఉత్తరం రావడమేమిటి? చాలా చిత్రంగా ఉందే" ఆశ్చర్యపోతూ అందుకున్నాడు కవీంద్ర. అందుకున్న ఉత్తరాన్ని ఆశ్చర్యంతో అటు ఇటు తిప్పి చూశాడు. అది ఒక ఇన్‌లాండ్ లెటర్. 'టు' అడ్రెస్ చూశాడు. అనుమానం లేదు. ఆ ఉత్తరం తనకే 'ఫ్రం' అడ్రెస్ చూశాడు. కల్యాణ్ అని ఉంది.

'కళ్యాణ్ తన ఫ్రెండే' అనుకున్నాడు మనసులో.

'కళ్యాణ్ తనకు ఉత్తరం రాయడమేమిటి? కళ్యాణ్‌కి ఫోనుంది. తనకూ ఫోనుంది పైగా కళ్యాణ్‌కి సెల్ ఫోన్ కూడా ఉంది. తనకీ సెల్ ఫోన్ ఉంది. ఒకరి నెంబర్ ఒకరికి తెలుసు కూడా. అయినప్పటికీ కళ్యాణ్ ఉత్తరం రాయడమేమిటి? తన కళ్లను తానే నమ్మలేకపోతున్నాడే?' అనుకుంటూ ఆ ఉత్తరం వైపు మరొకసారి అనుమానంగా చూశాడు కవీంద్ర.

'సందేహం లేదు. ఆ ఉత్తరం తనకే వచ్చింది. కళ్యాణే రాశాడు. ఈ కాలంలో కూడా ఇంకా ఉత్తరం రావడమేమిటి? ఫోను ద్వారా అప్పటికప్పుడే వార్తలు అందుతున్న ఈ రోజుల్లో ఇంకా ఉత్తరాల అవసరం ఉందా? అసలు ఇంకా ఉత్తరాలకు విలువ ఉందా?' అనుకుంటూ తల పైకెత్తి చూశాడు కవీంద్ర. మిగిలిన కొలీగ్స్ అందరూ కవీంద్రవైపు, కవీంద్ర చేతిలో ఉన్న ఉత్తరం వైపు వింతగా చూడసాగారు. వారు చూస్తున్న చూపులకే కవీంద్ర గిల్టీగా ఫీలయ్యాడు. వాళ్లందరి ముందూ ఆ ఉత్తరం విప్పి చదవడం ఇష్టం లేక మడిచి జేబులో పెట్టుకొని తన సీటులోకి వెళ్లి కూర్చున్నాడు కవీంద్ర.

సీట్లో కూర్చున్నాడే గానీ, కవీంద్ర మనసంతా ఉత్తరంపై ఉంది. ఇంతకీ ఆ ఉత్తరంలో కళ్యాణ్ ఏమని రాశాడో, ఏమిటి? అనే ఆతృత ఎక్కువైంది కవీంద్రలో. నెమ్మదిగా జేబులోని ఉత్తరం చేతిలోకి తీసుకొని విప్పి చదవసాగాడు కవీంద్ర.

ప్రియమైన స్నేహితుడు కవీంద్రకు-

నీకు ఒక శుభవార్త. నువ్వు లెక్చరర్ పోస్టు కోసం వెళ్లిన ఇంటర్వ్యూలో సెలక్టయ్యావు. ఈరోజే నేను డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కి వెళ్లి తెలుసుకున్నాను. పోయిన నెలలో నువ్వు ఇంటర్వ్యూకి వెళ్లిన సంగతి ఫోను చేసి చెప్పావు. రిజల్ట్ తెలుసుకోమని కూడా నాకు చెప్పావు. అప్పటి నుండీ రోజూ నీ సెలక్షన్ గురించి తెలుసుకుంటూనే ఉన్నాను. కానీ ఈ రోజే ఇక్కడ రిజల్ట్ తెలిసింది. ఈ విషయం వెంటనే నీకు ఫోన్ చేసి చెప్పాలనుకున్నాను. ఇంత మంచి వార్త కేవలం ఫోను చేసి చెబితే ఆ మాటలు ఫోను ద్వారా వచ్చి గాలిలో కలిసిపోతాయి. అందుకే ఈ శుభవార్తను లేఖలో పదిలపరుస్తున్నాను. నీ జీవితానికి ఒక దారి చూపిస్తున్న ఈ మాటలు ఫోను ద్వారా చెబితే తాత్కాలికంగా నీకు గుర్తున్నా, ఆ తర్వాత

# ఉత్తరం

మర్చిపోతావు. కానీ ఈ లేఖ ద్వారా తెలియజేస్తే అవి నీ జీవితాంతం జ్ఞాపకం ఉంటాయి. నీ స్నేహితుడినైన నన్ను కూడా ఈ లేఖ ద్వారా గుర్తుపెట్టుకుంటావు. పదే




పదే పదిసార్లు ఈ శుభవార్తను చదువుకోడానికి ఈ లేఖ నీకు ఉపయోగపడుతుంది.

డియర్ కవీంద్రా, ప్రస్తుతం నువ్వు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి గుడ్‌బై చెప్పెయ్యవచ్చు. అక్కడి నీ కొలీగ్స్ అందరికీ ఈ లేఖను చూపించి వారి దగ్గర నీవు వీడ్కోలు తీసుకో. కవీంద్రా నీకు మరొక విషయం, ఇది నీకు శుభవార్త అవునో కాదో తెలీదు. నా చెల్లెలు 'దీప' కూడా నీలానే లెక్చరర్ పోస్టుకి సెలెక్ట్ అయ్యింది. ఎప్పటి నుంచో నాకు ఒక కోరిక ఉంది. నా చెల్లెల్ని నీకిచ్చి వివాహం చేయాలని నా కోరిక. మరి నువ్వేమంటావ్. ఈ విషయం డైరెక్ట్‌గా ఫోనులో అడగలేకనే ఉత్తరం రాస్తున్నాను. ఉత్తరం రాయడానికి ఇది కూడా ఒక కారణమే. మరి నీ అభిప్రాయం తెలియజేస్తావా?

-నీ మిత్రుడు

కళ్యాణ్

ఉత్తరం చదివిన కవీంద్ర ఆనందానికి హద్దులే లేకపోయాయి. ఉత్తరంలోని ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క ముత్యంలా అనిపించసాగింది కవీంద్రకు. తన చేతిలోని రెండున్నర రూపాయల ఇన్‌లాండ్ లెటర్ ముందు తన ఇంటిలోని లాండ్‌ఫోను, తన జేబులోని సెల్‌ఫోను విలువ లేనివిగా అనిపించాయి. చేతిలోని ఉత్తరం ఆర్తిగా హృదయానికి హత్తుకున్నాడు కవీంద్ర. ఆ ఉత్తరం ఒక పెద్ద గ్రంథంలా కళ్యాణ్ ఒక మహాకవిలా అనిపించాడు కవీంద్రకు. ఆ ఉత్తరాన్ని అపురూపంగా మడిచి తన్మయత్వంతో జేబులో పెట్టుకున్నాడు కవీంద్ర. వెంటనే కవీంద్రకు కళ్యాణ్ చెల్లెలు దీప గుర్తుకు వచ్చింది.

"ఏయ్ రామూ! ఇలారా పోస్టాఫీస్‌కి వెళ్లి ఒక ఇన్‌లాండ్ లెటర్ పట్టుకురా" గట్టిగా అరిచాడు కవీంద్ర.

కవీంద్ర అరుపుకి అక్కడ ఉన్న కొలీగ్స్ అందరూ అర్థంకాక అతని వైపు చూస్తూ ఏవో గుసగుసలాడుకోసాగారు. కవీంద్ర చేతిలోని చిల్లర అందుకొని అటెండర్ రాము ఒక్క ఉదుటున ఇన్‌లాండ్ లెటర్ తీసుకువచ్చి ఇచ్చాడు. కవీంద్ర దానిని అందుకొని కళ్యాణ్‌కు రిప్లై రాయసాగాడు.

ప్రియమైన కళ్యాణ్‌కు,

నీ ఉత్తరం అందినది. అందులో నువ్వు అందించిన రెండు వార్తలూ నాకు శుభవార్తలే. నీకు చాలా థాంక్స్. నువ్వు అనుకున్నట్లుగానే ఫోనులో చెబితే ఆ వార్తలు అంత తియ్యగా ఉండేవి కావేమో. నువ్వు రాసిన ఉత్తరం ఇప్పటికి ఏభైసార్లు చదివాను. ఇంకా ముందు ముందు దానిని ఎన్నిసార్లు చదువుతానో? నా వివాహం విషయంలో నువ్వు తీసుకున్న నిర్ణయం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. నీ నిర్ణయంతో నేను ఏకీభవిస్తున్నాను. నువ్వు రాసిన ఉత్తరాన్ని నేను అందుకోబోయే అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తోనూ, నా నుండి నువ్వు అందుకోబోయే శుభలేఖతోనూ జతచేసి ఫైల్ చేస్తాను.

నీ మిత్రుడు

కవీంద్ర.

అంటూ రాసిన ఉత్తరాన్ని తనే స్వయంగా పోస్ట్ చేశాడు కవీంద్ర.

**-జి.మేరీ కృపాబాయి**
**(మచిలీపట్నం)**